# అసమర్ధుడు

సుబ్బారావు రేపు చచ్చిపోవడానికి గట్టిగా నిశ్చయించాడు. రేపటితో ఇంక తను ఈ భూమిమీద ఉండకూడదని తీవ్రంగా ఆలోచించి నిశ్చయించేశాడు సుబ్బారావు.

"చచ్చిపోవాలి" చచ్చిపోవాలి అనుకుంటూనే ముప్పై ఏళ్ళ బ్రతికాడు సుబ్బారావు! చావంటే ఏమిటో తెలిసింది మొదలు చచ్చిపోవాలనుకుంటూనే పున్నాడు....అనుకుంటూనే రోజులు గడిపేశాడు!

ఈ మారు అలాంటి అనుకోవడం కాదు! .... నిజంగానే అనుకున్నాడు. గట్టిగానే అనుకున్నాడు!

చావాలి!....చచ్చిపోయి కనీసం తనకి చావడమన్నా చేతవచ్చుని నిరూపించాలి. చచ్చి సాధించాలి. చచ్చి పగ తీర్చుకోవాలి. ఎవరిమీద? అందరిమీదా! ఈ ప్రపంచంమీద. ఈ మనుష్యులందరిమీదా! ముఖ్యంగా ఆ రాక్షసి అదే ఆ పెళ్ళాం అనబడే ఆ మహంకాళి! ఆ అమ్మవారు. ఆ శూర్పణఖ, ఆ భూతం, ఆ దెయ్యాన్ని కుళ్ళి కుళ్ళి ఏడ్చేట్టు చేయాలి! తను చచ్చి దాన్ని వెధవముండని చేసి మూల కూర్చోపెట్టాలి. అప్పుడు గాని బుద్ధిరాదు దానికి! తన విలువ, తన ప్రయోజకత్వం అప్పుడుగాని తెలిసిరాదు. కూతురు ముండమోసి కూర్చుంటే .... తనని ఇన్ని బాధలు పెట్టినవాళ్ళు తను ఏడుస్తుంటే నవ్వినవాళ్ళు .... తనని ఏడిపించినవాళ్ళు కుళ్ళి కుళ్ళి ఏడ్చేట్టు, చావాలి, చావాలి. సుబ్బారావులో పగ రాజుకో సాగింది.

"చచ్చిపోవాలి! .... ఎలాఁ .... ఛా చావడానికి ఇంత ఆలోచన ఏమిటి....చావాలంటే ఎన్ని మార్గాలులేవు? విషం తినొచ్చు, ఉరేసు

కోవచ్చు. నూతులోనో, చెరువులోనో పడచ్చు! ఏ రైలుకిందో బుర్ర పెట్టొచ్చు. అన్నింటికంటె విషం తిని చావటం సుళువు! హాయిగా దర్జాగా, మంచంమీద పడుకుని చావచ్చు! కాని .... తాను చచ్చిపోయే ముందు నలుగురికి తెలియాలి!....చచ్చిపోతుంటే వాళ్ళ మొహాలు ఎలా వుంటాయో చూసి ఆనందించాలి! అందరికీ తన ప్రయోజకత్వం చూపి వాళ్ళని ఏడిపించి పగ తీర్చుకుని మరీ చావాలి!....

"రాత్రి అయితే ఎవరూ చూడటానికి అవకాశం వుండకపోవచ్చు అంచేత తీరుబడిగా లేచి ఉదయం కాఫీలో విషం కలిపి త్రాగడానికి నిశ్చయించాడు సుబ్బారావు....విషం తెచ్చుకుని సాయంత్రమే జాగ్రత్త చేసుకుంటాడు....ఇంక ఆచరణలో పెట్టడమే ఆలస్యం!....

"తన విలువ అందరూ గుర్తించే రోజు వస్తూంది. రాబోతూంది, లేకపోతే తన నందరూ ఇంత హీనంగా చూస్తారా? తెల్లవారింది మొదలు ప్రతి వెధవలూ "హేళనచేసి" ఓ చవట దద్దమ్మగా జమకట్టి నోటికొచ్చినట్లు మాట్లాడుతారా?....ఊర్లోవాళ్ళ బుద్ధి గడ్డితింటే, ఇంట్లో వాళ్ళు కన్న తల్లి, తండ్రి .... కట్టుకున్న భార్య, పిల్లనిచ్చిన అత్త మామలు....ఆఖరికి బొడ్డూడని ఐదేళ్ళ వెధవ .... ఆ కుర్రవెధవ ఆ కొడుకుగాడు కూడ తనని లోకువచేసి అవమానిస్తారా? కోపంతో, అవమానంతో సుబ్బారావు శరీరం దహించుకు పో సాగింది.

"ఒక్క రెండు రూపాయలకోసం ఎన్ని మాటలన్నారు? ఇంట్లో గొడ్డులా, పాలేరు వెధవకన్న కనాకష్టంగా ఇరవై నాలుగు గంటలు పొలాల్లో, పేడలో, బురదలో, చలిలో, వానలో, ఎండలో రాత్రనక పగలనకా శ్రమిస్తే రెండు రూపాయలు ఖర్చు పెట్టుకోడానికి స్వతంత్రం లేని బ్రతుకు! ఆఖరికి పాలేరు వాళ్ళకి బీడీ ఖర్చుకిచ్చే పావలా అర్థ కూడ తనకి లేదు! జీతం బత్తెంలేని కమతగాడైపోయాడు ఆఖరికి! తిండి పెట్టకపోతే చస్తాడని, చస్తే తన కూతురికి పసుపు కుంకం వుండ

దని ఏదో విసుక్కుంటూ, కసురుకుంటూ ఇంత తిండి పడేస్తున్నారు గాని లేకపోతే అదీ లేకపోను!

సిగరెట్లకి రెండు రూపాయ లడిగితే, "ఆఁ దమ్మిడీ సంపాదన లేదుగాని, రోజుకి రూపాయి సిగరెట్లు మాత్రం కాల్చాలి! ఇంకోరి తిండి తింటూ పెద్ద ఆఫీసరులాగ దర్జా వెలిగించడానికైన సిగ్గు వేయదు కాబోలు!" ఈసడింపుగా, మొగుడన్న గౌరవమైన లేకుండా అంటుందా ఆ పెళ్ళాం!

ఛా, వెధవ సిగరెట్ల అలవాటు ఎంత మానుకుందామన్నా మానుకో లేక గతిలేక అభిమానం చంపుకుని ఏ నాలుగైదు రోజులకో రూపాయి అడిగితే....అలా అంటుందా? అంత తలబిరుసా దానికి!

వళ్ళు మండిపోయి కాస్త గట్టిగానే అన్నాడు ఉదయం "ఏం, మీ యింట్లో గొడ్డులా చాకిరీ చేస్తున్నాను, ఏం, ఆ మాత్రం నౌకర్ల పాటి చేయకపోయానా? వాళ్ళకి జీతం ఈయడంలేదా? అలాగే అనుకో!" అన్నాడు సుబ్బారావు.

"మీ పొలం పని మీరు చేసుకోడం ఎవరికి వుద్ధరింపు? ఏదో పాపం, ఎవరికో చాకిరి చేస్తున్నట్టు మాట్లాడుతున్నారు. మావాళ్ళకేమిటి.... ఇవాళుంటారు, రేపు ఇదంతా ఎవరిది?" అంది గడుసుగా! పనిచేయించు కునేటప్పుడు మాత్రం మహా చక్కగా, నెమ్మదిగా చెప్తుంది. కసిగా పళ్ళు కొరికాడు సుబ్బారావు.

ఆ మామ ఎప్పుడు చస్తాడో, ఎప్పుడు ఆ పొలం స్వంతం అవు తుందో దేముడికి ఎరుక! కాని ఈ లోపల తను చావడం నిశ్చయం!

ఆ మామకూడ చుట్టపొగ గుప్పు గుప్పుమని వదులుతూ సావ కాశంగా ఆరంభించాడు, కూతురిని వెనకేసుకు వచ్చి జీతంయిచ్చి పని చేయించుకునేందుకు నౌకర్లు చాలమంది దొరుకుతారులే నాయనా! నీ కెందుకు జీతం యిచ్చి చేయించుకోవడం? అయినా నాకు తెలియక అడుగుతా, ఎవరికి చేస్తున్నావంట! ఎవరికోసం చేస్తున్నావు? నా కోసమా, నీ కోసమా ఉంటే నీవు, నీ పెళ్ళాం, నీ పిల్లలే తింటారు రేపొద్దున.

మా కోసం నీవు కష్టపడుతున్నావన్న పిచ్చి భ్రమలో వుంటే అది విడిచి పెట్టుకో. ఇంతకీ నిన్నింట్లో వుంచుకుని పోషిస్తున్నది ఎందుకంటావు? అంతగా వుండడం యిష్టంలేకపోతే నిన్నిక్కడ ఎవరూ పట్టుకు కూర్చోలేదులే బాబూ'' అంటూ చల్లచల్లగా జాడించి వదిలాడు.

ఎక్కడికీ తను వెళ్ళలేడనే గదూ, అది తెలిసేగదూ అంత నిర్భయంగా నిరసనగా అనగలిగారు. సుబ్బారావు నిట్టూర్చాడు.

"ఓయబ్బో, ఏం వున్నా లేకపోయినా, పౌరుషానికేం లోటులేదు అల్లుడుగారికి'' అంది నెమ్మదిగా అత్తగారు .... ఏం చూసుకునో అంత మిడిసిపాటు ఈసడింపుగా చూసింది, అత్తగారు.

అవును, ఏం చూసుకుని తనకీ మిడిసిపాటు! గతిలేక ఇల్లరికపుటల్లుడిగా వచ్చిన తనకి పౌరుషం కూడా ఎందుకు? ఉద్యోగం సద్యోగం లేకుండా వీళ్ళింట్లో వుండబట్టి గదా వీళ్ళకింత తలపొగరు. ఇంత నీచంగా, హీనంగా చూస్తున్నారు .... ఇంత లోకువయ్యాడు అందరికి. వీళ్ళనని ఏం లాభం? తన వాళ్ళని అనాలి....ఏభై యకరాల మాగాణి ఒక్కతే కూతురు. నీ విక్కడ వుండి చేసే నిర్వాకం ఏముంది? ముష్టి నూరు రూపాయల ఉద్యోగం కోసం చూస్తే అవతల బోలెడు ఆస్తి నీ లాంటివాళ్ళు వాళ్ళకి కావల్సినంతమంది దొరుకుతారు అంటే నిజమే ననుకున్నాడు. యెక్కడైనా తనకి లభ్యమయ్యే ప్రేమాభిమానాలు ఒకటేగదాని బుద్ధిగడ్డితిని వప్పుకున్నాడు. ఈ ఇల్లరికపు అల్లుడిని చేసి మానాభిమానాలు చంపుకుని బ్రతకమన్న తనవాళ్ళ ననాలి అసలు.

పెళ్ళయిన ఓ మూడు నెలలేమో కొత్త అల్లుడన్నట్టు చూశారు సుబ్బారావుని అత్తవారు.

తరువాత, తరువాత క్రమంగా ఒక్కొక్కపని నెమ్మదిగా అప్ప చెప్పసాగారు. "చూడు సుబ్బారావు....ఆ కూలివెధవ లేం చేస్తున్నారో, దగ్గిరుండకపోతే చేసి చావరు, నా వంట్లో బాగుండలేదు. కొత్త పొలం వెళ్ళు నాలుగు రోజులు'' అన్న మామగారికి నాలుగు రోజులు కాదుకదా నాలు గేళ్ళయినా వంట్లో సరిగా లేకపోవడం, పాపం సుబ్బారావు చాల రోజుల

వరకు ఆ సంగతి గమనించలేకపోయాడు. పొలం పనులన్నీ తన డ్యూటీ అయిందని తెలుసుకున్నాడు చాలరోజుల తర్వాత. తెలుసుకున్నా ఏం చేయగలడు గనక! అక్కడికీ ఒకసారి కనకం దగ్గిర చూచాయగా అంటే "మా నాన్నకి వంట్లో బాగుండటంలేదు. పెద్దవారయ్యారు. ఓపిక లేదు. అని ముందులో అనే కనకం రోజులు గడిచినకొద్దీ మా నాన్న పెద్దవారయ్యారు. సాయం కావాలనేకదా ఇంట్లో మిమ్మల్ని తెచ్చి పెట్టు కున్నారు, మీ రూరికే కూర్చోడానికా ఇల్లరికపు టల్లుడిని తెచ్చుకున్నది' అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేసింది. ఆ దెబ్బతో పెళ్ళాంతో ఫిర్యా దులు మానాడు సుబ్బారావు.

"చూడబ్బాయ్, ఆ గేదెలు వచ్చిపడ్డాయి. ఆ పాలేరు వెధవ ఎక్క డికి పోయాడో. కాస్త కట్టేయ్యద్దూ" అని అత్తగారు ముందురోజు అంటే, కాబోలనుకున్న సుబ్బారావుకి ఆ పాలేరు వెధవ రోజూ ఆ వేళకి ఎక్కడ తగలబడుతున్నాడో అర్థం అయి, గేదెలు కట్టడం, వాటికి మేత, కుడితి వగైరాలు పెట్టడం, పాలు తియడం అన్నీ తన పనులలో జమకట్టారని తెలియ వచ్చేసరికి గిర్రున ఏడాది తిరిగిపోయింది.

"కనకానికి పూలంటే ప్రాణం .... ఆ మల్లెమొక్కలు, కనకాం బరం మొక్కలు అన్నీ ఎండిపోతున్నాయి. పెద్దదాన్ని ఓపికలేదు. నీరు తోడలేను. స్నానం చేసేటప్పుడు రెండుచేతలు తోడిపొయ్యి నాయనా" అని అత్తగారు అంటే పోనీలే పూలు పెళ్ళానికేగదా, ఆ పెళ్ళామూ తన కోసమేగదా పూలు పెట్టుకుంటుంది అన్న సదుద్దేశంతో ఆరంభించిన సుబ్బారావుకి యింట్లో మొక్కలకి, పాదులకి, చెట్లకి రోజు నీళ్ళు తోడి పోయడంకూడ తన వంతయిందని తెలుసుకునేసరికి కోపం వచ్చినా ఏం చేయలేకపోయాడు.

అంతేకాక మొదట్లో నూతిగట్టు దగ్గిర ఒక బిందె, బాల్చీ చొప్పున మొదలైన గంగాళాలు, గుండిగలు మొదలైన వాటిలో రోజూ వాడుక్కి నీళ్ళు తోడ్డంకూడ తనపనే అని తెలుసుకునేసరికి తనమీద తనకే జాలి పుట్టింది సుబ్బారావుకి.

ఉదయాన్నే లేచి హడావిడిగా కాలకృత్యాలు తీర్చుకుని గేదెల పాలు తీసి, వాటికి కుడితి పెట్టి, ఇంట్లోకి కావల్సిన నీళ్ళు అన్నీ తోడి ఇన్ని కాఫీనీళ్ళు గొంతులో పోసుకుని ఎనిమిది గంటలకల్లా పొలం పరిగెట్టి వానలో తడిసి, ఎండకి మాడుతూ రెండు గంటలకి ఇంటికిచేరి ఇంత తిండితిని, మళ్ళీ పొలం పరిగెట్టి చీకటిపడే వేళకి కొంపచేరి మొక్క లన్నింటికీ నీళ్ళు తోడి, పశువు లన్నింటిని కట్టి మేతవేయడంతో సుబ్బారావు దినచర్య ముగుస్తుంది.

తన పనులేమిటో తెలుసుకున్నాక సుబ్బారావు ఆ యింటి అల్లుడుగా కాక ఓ కమతగాడి క్రింద జత అయ్యాడని తెలుసుకున్నాడు. ఆ యింట్లో అందరూ, ఆఖరికి కనకం కూడ ఆ దృష్టితోనే చూస్తున్నట్టు గ్రహించడానికి చాలరోజులే పట్టింది పాపం సుబ్బారావుకి !

మొదట్లో మామగారి పంక్తిన మామగారితో సహా, పెరుగు అదీ వేసి వడ్డించేవారు. తరువాత, తరువాత సుబ్బారావు వచ్చే వేళకి మామగారు, అత్తగారు, కనకంతో సహా అందరూ భోజనాలు చేసేసేవారు. ఏ పాలేరు వాడికో పెట్టినట్లు అడుగు బొడుగు అన్నం, చాలీచాలని కూరలు, మజ్జిగనీళ్ళతో కనకంవచ్చి వడ్డించేది సుబ్బారావు వచ్చాక.

ముందు ఒకటి రెండుసార్లు కనకం వడ్డిస్తూ "అబ్బ ! మీ రొచ్చేసరికి మరీ ఆలస్యం అవుతూంది. నీరసంగా వుంటుందని తినేస్తున్నాను. అమ్మావాళ్ళు తినేయమంటే !" ఏమనుకుంటాడో అన్నట్లు అంది. ప్రక్కన వున్న అత్తగారు కూతురికి వంతపాడుతూ "అవునే తల్లీ. ఉత్తమనిషివి కూడా కాదు, అతనికోసం నీ వెందుకు పడిగాపులుపడి కూర్చోవడం...." అంటే ఉత్తమనిషికాని కనకాన్ని గురించి జాలిపడి పోనీలే అనుకున్నాడు. కాని తర్వాత కనకం గట్టి మనిషయ్యాక కూడ ఆ అలవాటు మారకపోవడం గమనించాకగాని సుబ్బారావుకి వాళ్ళు తనకి ఏపాటి మర్యాద యిస్తున్నారో గ్రహించలేకపోయాడు ! తెలుసుకున్నా ఏమనగలడు ? అన్నా ఎవరూరుకుంటారు ? ఒకసారి కనకంతో మాట వరసకన్నట్టు అంటే కనకం గయ్‌మని లేచింది. "ఏం మీరే రెండు

గంటలకో వస్తే అప్పటివరకు నేను మాడుతూ కూర్చుంటేగాని మీ మీద గౌరవం వున్నట్టుకాదా ! నే నుండలేను సుమా రెండు జాములవరకు'' అని నిర్మొహమాటంగా చెప్పేసింది. "ఏం తెగులు, ప్రొద్దుట కంచెడు చద్దన్నం తిన్నదానివి, కాఫీ నీళ్ళు త్రాగిన నా కోసం ఆ మాత్రం వుండ లేవా'' అని అడుగుదామన్నా అడగడానికి ధైర్యం చాలని సుబ్బారావు ఇంకేం అంటాడు ! పాపం, పట్నవాసంలో పుట్టి పెరిగిన సుబ్బారావుకి చద్దన్నం తినడం అలవాటులేక, ఇటు టిఫిన్లులేక ఉత్త కాఫీ నీళ్ళతో రెండు జాములవరకు వుండడం ప్రాణం కడకట్టినట్లు వుండేది ! దానికి సాయం ఆ చప్పగా చల్లారిన భోజనం, ఆ పెట్టే తీరు చూసి ఆ వున్న ఆకలి కాస్త మాయమయేది !

కనకం ఒక్కర్తే కూతురు అవడంవల్ల, చాలా గారాబంగా పెంచడంతో, మంకుతనం, మాట పెళుసు, బొత్తిగా మంచి మర్యాద లేకుండా ప్రవర్తించడం, నోటి తొందర అన్నీ ఒక పాలు ఎక్కువే నన్న సంగతి సుబ్బారావుకి పెళ్ళయిన నెలకే బోధపడింది. ఆకారంలోనే కాక బుద్ధులలో కూడ గయ్యాళితనం తొంగిచూసే కనకం సుబ్బారావుకి ఓ మహంకాళిలా కన్పించి ఆమె నోటికి జడిసేవాడు. ఖర్మంకాలి ఓ చిన్నమాట అన్నా కనకమేకాక ఆమె తరుఫున ఆ తండ్రి, ఆ తల్లికూడ ఏకమయి సుబ్బారావు నోరు మూయించి, అతని స్థానం గుర్తు చేసేవారు.

సుబ్బారావు భార్యవల్ల సుఖపడినదీ, కనకం భర్తని గౌరవంగా చూసినరోజులు ఏమయినా వుంటే అవి పెళ్ళయిన ఓ రెండు మూడు నెల లేమో ! అప్పటినించి కనకంలో సుబ్బారావుపై అగౌరవం సుబ్బారావుకి కనకంపై ఏహ్యం రోజు రోజుకి పెరగసాగింది. ఉత్తశుద్ధ పల్లెటూరి మొద్దులావుండే కనకాన్ని చూస్తూంటే అదోలా అనిపించేది సుబ్బారావుకి. ఆ బిగించివేసిన గరిట కాడలాంటి జడ, తల్లో తట్టెడు పూలు, కాళ్ళకి పట్టీలు, ఇంత పాముకున్న కాటుక, మోకాళ్ళపైకి కట్టిన చీర, బొత్తిగా మోటుగా కనిపించే కనకంలో వెదికినా నాజూకుతనం, నాగరికత కనిపించేదికాదు సుబ్బారావుకి. పోనీ ఆకారంమాట అలావుంచి బుద్ధులు, చేష్టలు

కూడ చాల అనాగరికంగా కనిపించి ఏహ్యించుకునేవాడు సుబ్బారావు. అలా కంచెడు చద్దన్నం తినడం, పెద్ద గొంతు పెట్టి మాట్లాడ్డం, ఐదో క్లాసు చదివిన పాండిత్యం అంతా చూపిస్తూ, ఊర్లో ఆడవాళ్ళందరిని పోగేసి తండ్రి పట్నంనించి తెచ్చిన పత్రికలు, ఓ పురాణ గ్రంథాల్లా పెద్ద గొప్పగా రోజుకో పేజీ కష్టపడి చదివి విన్పించడం, కనకం తెలివి తేటలకు, చాతుర్యానికి మురిసిపోతూ ఆ మామ, అత్త, వూర్లో వాళ్ళు తల లూపుతూ మహానంద పడిపోవడం, అవన్నీ చూస్తే పట్నవాసంలో పుట్టి పెరిగిన సుబ్బారావుకి మండుకొచ్చేది. కనకాన్ని ఏమనలేక, ఏమన్నా వినదని తెలిసి కనకంమీద ఏహ్యాన్ని పెంచుకోవడం తప్ప ఏం చేయలేక పోయాడు.

మొదట్లో యింటిదగ్గరనించి తెచ్చుకున్న కాస్త డబ్బూ అయిపోవడంతో పై ఖర్చుకి ఎవరిని అడగాలో తెలియక ఇబ్బందిపడి ఆఖరికి యింటికి తండ్రికిరాస్తే "నీకు డబ్బు యిచ్చేపాటి డబ్బు నాకే వుంటే నిన్ను యిల్లరికం ఎందుకు యిస్తాను నాయనా ! నీ బాధ్యత, మంచిచెడ్డలు అన్నీ నీతోపాటు వాళ్ళకే అప్పగించాను ... మొహమాటపడి లాభంలేదు .... ఒకరోజులో పోయేది గనకనా, జన్మంతా అక్కడ గడపవలసినవాడివే. వాళ్ళని కాకపోతే ఎవరిని అడుగుతావు ఎవరిస్తారు ? అడగందే అమ్మయినా పెట్టదు నాయనా'' అంటూ ఉత్తరం రాశాడు.

మొదటిసారి సిగ్గుపడుతూనే భార్యని ఓ పది రూపాయలు అడిగితే ఏమనుకుందో కనకం వెంటనే తండ్రి నడిగి తెచ్చి యిచ్చింది రెండు మూడుసార్లు అలా యిచ్చి అక్కడనించి విసుక్కోడం ఆరంభించింది. 'అస్తమాను పదులు ఇరవైలు అడగడానికి మీకు మొహమాటం లేదేమొ గాని నా కుంది. అయినా ఏదో ఆర్జించి పోస్తున్నట్టు ఈ ఖర్చులేమిటి "మీకు'' అని కసరడం ఆరంభించింది.

మామగారుకూడ "ఏవమ్మా, రోజురోజుకి పెరిగిపోతుందే మీ ఆయనగారి ఖర్చు. ఏమున్నా లేకపోయినా, వేషాలకి లోటులేదు దొర

గారికి'' అని నిరసనగా అనడం, అత్తగారు వంతపాడుతూ ''ఆ, ఎందుకు ఖర్చుపెట్టడు, తేరగా వస్తుంటే'' అని సన్నాయి నొక్కులు నొక్కడం సుబ్బారావు విన్నా, ఏమి చేయగలడు? మనిషిగా పుట్టి, మనిషిగా బ్రతక లేని, తన బ్రతుకును గురించి జాలిపడడం మినహా! అదే కూతురికయితే, నోట్లోంచి మాట రావడం తడవుగా పట్నం పంపించి కొండమీది కోతి నైనా తెప్పిస్తాడు.

ఇంక మనవడు అయితే సరేసరి! తనమీద లేకపోయినా తన కొడుకుమీద అభిమానం వున్నందుకు సంతోషించాడు మొదట్లో సుబ్బా రావు. కాని రానురాను ఆ కుర్రవెధవ పట్టుమని ఐదేళ్ళులేని ఆ వెధవకూడ తనని తండ్రిగా గుర్తించనైన గుర్తించకపోవడం సుబ్బారావుకి అవమాన మనిపించింది. చిన్నప్పటినించి ఎవరో చెప్పినట్లు, ఏం కావల్సినా పొరపాటు నైనా తండ్రిని అడిగేవాడు కాదు. తాతగారినే అడిగేవాడు. కొడుక్కి కూడ తన అప్రయోజకత్వం తెలియడం సహించలేకపోయాడు సుబ్బా రావు. ముద్దుగా కొడుకుని దగ్గర కూర్చోపెట్టుకుని ''బాబూ, ఈసారి ఊరికి వెళ్ళినప్పుడు, నీకు బొమ్మలు, బిస్కట్లు తెస్తానులే నాన్నా'' అని అంటే ఆ వేలెడులేని వెధవ నిర్లక్ష్యంగా ''తాత తెస్తాడులే నాన్నా'' అంటాడు. ఆ పసి మనసులో ఆ భావాలు నాటిందెవరో కూడ తెలుసు సుబ్బారావుకి. మాటకి ముందే ఆ కుర్రవాడి దగ్గిరే తనని హేళనగా మాట్లాడడం, నిరసనగా చూడడం, తేలికగా నవ్వడం .... యివన్నీ వాడి మనసులో నాటుకుని ఎవరూ లెక్కచేయని తండ్రిని తనూ ఖాతరు చేయ నక్కరలేదన్న భావం ఏర్పడి, సుబ్బారావు మాటే లెక్కచేసేవాడుకాదు.

ఆ రోజు రెండు నెలలక్రితం ఎంత అవమానం జరిగింది! తల్చుకుంటే సుబ్బారావు వళ్ళు దహించుకు పోసాగింది. ఆ రోజునించే చావాలన్న కోరిక సుబ్బారావులో ప్రబలింది. ఆ రోజు సుబ్బారావు ఏదో పనిమీద పట్నం వెడుతూ మూడు చక్రాల సైకిలు కావాలని ఎన్నో మార్లు మారాం పెట్టిన సంగతి గుర్తుకువచ్చి కొడుకుతో ''నీకు వచ్చే

టప్పుడు సైకిలు తెస్తానులే బాబూ !" అన్నాడు. వాడు "నీవేం తెస్తావు?" అన్నట్టు నమ్మలేనట్టు చూశాడు. అది విన్న కనకం హేళనగా నవ్వుతూ.." ఓయబ్బో సైకిలు తెస్తారట. సైకిలు ! దమ్మిడి సంపాదనలేని ఈయన సైకిలు తెస్తారట కొడుక్కి .... ఏదో వందలు వేలు ఆర్జిస్తున్నట్టు ఇవి తెస్తాను, అవి తెస్తానని వాగ్దానాలు కూడాను. మీ నాన్నేం తెస్తారురా బాబూ. తాత తెప్పిస్తాడులే నాన్నా" అంది. సుబ్బారావు మనసు గాయ పడింది. ఎన్నడూ రానంత కోపం వచ్చింది. ఉగ్రుడై కనకాన్ని మింగే సేట్టు చూశాడు. కనకం ఆ కోపాన్ని లెక్కచేయకుండా, రెట్టిస్తూ, "ఏం వున్నమాటంటే అంత ఉలుకెందుకు ? .... దమ్మిడి సంపాదన లేదుగాని మాటలు చూస్తే కోటలు దాటుతాయి. ఎందుకా గొప్ప కబుర్లు" నిరసనగా అంది. మామగారు, అత్తగారు మొహాలు ప్రక్కకు తిప్పుకుని ముసి ముసి నవ్వులు నవ్వడం చూసిన సుబ్బారావుకి తన అసమర్థతమీద తనకే ఏహ్యాం కలిగింది ! మనిషిగా పుట్టి, మనిషిగా గుర్తింపబడని తన బ్రతుకు అంతం చేసుకోవాలని ఆ రోజునించీ తీవ్రంగా నిశ్చయించు కున్నాడు, ముప్ఫైఏళ్ళగా తనని మనిషిగా గుర్తించని యీ ప్రపంచం యిక ముందు గుర్తిస్తుందని ఆశించడం వెర్రి అని నిశ్చయించుకున్నాడు సుబ్బారావు. ఈ నిర్లక్ష్యం యింక భరించే శక్తి తనకి లేదని తెలుసు కున్నాడు.

అసలు యీ నిర్లక్ష్యం సుబ్బారావు పుట్టకమునుపే సుబ్బారావుపట్ల అందరికీ ఏర్పడింది ! కన్నతల్లికి, తండ్రికీ, ఇంట్లో అందరికి లోకువే సుబ్బారావు ముందునించి !

అందరి వెనక తండ్రికి అరవయ్యోపడిలో, తల్లికి ఏభయ్యోపడిలో కోరుకోని బిడ్డగా, పదిమంది సంతానాన్ని కని విసిగిపోయిన తల్లి, తండ్రులకి పుట్టినబిడ్డ ! తల్లిదండ్రుల ప్రేమకి నోచుకోని బిడ్డ ! ఏ ముద్దు ముచ్చటా నోచుకోని బిడ్డ ! సుబ్బారావు పుట్టినందుకు సంతోషించిన ప్రాణిలేదు. "వెధవ ! ఉద్ధరించడానికి పుట్టాడు. సుఖపడిపోతున్నానేమో

నని దేముడు ఈ వెధవని పంపాడు నా ప్రాణానికి ! అని అధమం రోజుకోసారైనా విసుక్కుని, ఏకాస్త అల్లరిచేసినా చితకబాదేది తల్లి ! తన జన్మకి తనెంతవరకు బాధ్యుడో, కారణభూతుడో అప్పుడు గాదుగదా, యిప్పటికీ అంతుదొరకని ప్రశ్నే సుబ్బారావుకి. అప్పుడప్పుడు కాస్త జ్ఞానం వచ్చాక, బుద్ధితెలిశాక .... మరీ అందరూ ఉత్తి పుణ్యానికే తిట్టినప్పుడు, గుడ్లనీరు నింపుకుంటూ "నేనేం మిమ్మల్ని కనమని ఏడ్చానా ? అని అడిగేయాలనుకునేవాడు కోపంగా. కాని, అ అడిగే సమర్థతే సుబ్బారావుకుంటే సుబ్బారావుని అందరూ ఓ అసమర్థుడిగా ఎందుకు జత కట్టారు ?

అసలు సుబ్బారావు అసమర్థతకి ఏడాదిలోపునే ముద్రపడింది ! తల్లి "మొద్దు వెధవా ! ఏడాది వచ్చినా నడ్డినిలపలేవు. ఏణ్ణర్థం వచ్చినా నాలుగడుగులు వేయడం రాదు. మూడేళ్ళు వచ్చినా నోరు పెగలదు! ఇలా రకరకాలుగా .... వీలయినపుడల్లా సుబ్బారావు అసమర్థతని వెల్లడించేదట ! బలహీనంగా పుట్టడం పోషణసరిగాలేక నీర్సంగా వుండడం, అదీ పాపం సుబ్బారావు తప్పేనా ? అవునోకాదో ఆలోచించే సామర్థ్యం సుబ్బారావుకిలేదు. బామ్మ ఐదేళ్ళు వచ్చేక కూడ ముద్దులుచేసి తినిపిస్తూ "వెర్రి నాగన్నా ! తిండితినడంకూడా రాదు. ఎలా బ్రతుకుతావురా సన్నాసీ, అని ముద్దుముద్దుగా చివాట్లు పెట్టేది. ఆటపాటల్లో సుబ్బారావుని చేర్చుకునేవారుకారు. అక్కలు అన్నలు, అధవా చేర్చుకున్నా .... "వెధవా !" దాక్కోవడం కూడ చేతకాదు, మొద్దు వెధవా నీవేం ఆడతావు !" అంటూ బయటికి నెట్టేవారు. ఆటల్లో ఇరుగు పొరుగు పిల్లలచేత దెబ్బలుతిని ఏడుస్తూ తల్లి దగ్గిరకి వెడితే "చాతకాని చవటా ! వాళ్ళతో చాలలేక నా దగ్గిరకొచ్చి ఏడుస్తావేం ! అంటూ మరి రెండు అంటించేది.

అక్షరాభ్యాసంనాడు ఆరుసార్లు పలకపుల్ల చేతిలో సరిగా పట్టించలేని మాష్టరు విసుక్కుని "బడుద్ధాయి పలకపుల్ల సరిగా పట్టుకోవడం చాతకాని నీవేం చదువుతావురా అని దీవించాడు.ఏ ముహూర్తాన ఆ మాట అన్నాడో ఆ గురువుగారు, అక్షరాలా అలాగే ఏ క్లాసు రెండుసార్లు చూడకుండా పైకి వెళ్ళలేదు సుబ్బారావు. అదైన స్వంతంగా ప్యాసయి

కాదు ! .... "నీ కెందుకురా బాబూ చదువు ! ఆ సరస్వతీదేవిని విసిగించకురా నాయనా !" అంటూ తమ క్లాసులోంచిపోతే చాలునన్నట్లుగా రెండోసారి పై క్లాసులోకి నెట్టేవారు మాష్టర్లు స్కూల్లో. అలా అలా మెట్రిక్‌వరకు పాకగలిగాడు సుబ్బారావు ఇరవై ఏళ్ళకి ! ఆ మెట్రిక్‌లో పైకిత్రోసే నాధుడు ఎవరూ లేకపోవడంతో అక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నాడు సుబ్బారావు. ఓ మూడేళ్ళు చూసి, కొడుకు సామర్థ్యాన్ని అర్థం చేసికొన్న ఆ తండ్రి చదువు మాన్పించి టైపు నేర్పించాడు. కాస్త తొందరగానే సుబ్బారావుకి టైపుచేయడం అబ్బింది. పరీక్ష ప్యాసయ్యాక, తండ్రి ఎవరెవరినో పట్టుకుని ఉద్యోగం వేయించడానికి ప్రాకులాడి .... ఆఖరికి .... ఎప్పుడో చిన్నప్పుడు తనదగ్గిర చదువుకున్న ఓ విద్యార్థి ఓ కంపెనీ మేనేజరుగా వుంటే అతన్ని బ్రతిమలాడి సుబ్బారావుకి ఓ తొంభై రూపాయల ఉద్యోగం వేయించి కన్నందుకు బాధ్యత తీర్చుకున్నట్లు చేతులు దులుపుకున్నాడు.

ఉద్యోగస్తుడి నైనానన్న సుబ్బారావు సంతోషం నెలరోజులు కూడా గాకముందే చప్పగా చల్లారిపోయింది. అసలు ఆఫీసులో అడుగుపెట్టిన మొదటిరోజే, గాభరాతో వణికే సుబ్బారావు అవతారం వంక అదోలా, చీదరింపుగా చూశాడు ఆఫీసరు. ఆ చూపుల్లో తిరస్కారం, నిరసన, హేళన చూసిన సుబ్బారావు మరింత నీళ్ళుగారిపోయాడు. ఏదన్నా తప్పు దొరుకుతుందా, సుబ్బారావు భరతం పడదామా అన్నట్లుండే ఆఫీసరుని చూసి సుబ్బారావు వణికిపోతూ ఒక పదిలైన్లు టైపుచేస్తే, అందులో ఇరవై తప్పులుండేవి. ఆ కాగితం చూసి మరింత ఉగ్రుడై పోయేవాడు ఆఫీసరు. రానురాను సుబ్బారావులో తప్పులెంచడమే పనిగా పెట్టుకున్నట్లుండేవాడు ఆఫీసరు. అతని మాటలు, చూపులు "ఏదో మీ నాన్నమాట కాదనలేక నీకు ఉద్యోగం ఇచ్చానుగాని, నీ మొహానికి ఉద్యోగం ఏమిటి" అన్నభావం ప్రతిక్షణం వ్యక్తం చేస్తుంటే, తోటి ఉద్యోగులు హేళనగా నవ్వితే అవమానంతో తల కృంగిపోయేది సుబ్బారావుకి. తనంత కష్టపడి, ఒక్క నిముషం తలెత్తకుండా కష్టించి పనిచేసినా, తనకి తగిలే చివాట్లు, ఏ పని చేయకుండా, ఆఫీసరు ఆఫీసులో వుండే ఓ గంటో

రెండుగంటలో పనిచేసినట్లు నటించే తక్కిన గుమాస్తాలకి ఆ తిట్లు ఎందుకుండవో." అని ఎంత ఆలోచించినా సుబ్బారావుకి తెలిసేది కాదు. తనఖర్మ ! అని సరిపెట్టుకుని వూరుకునేవాడు పాపం ! తిట్టితిట్టి విసిగి పోయిన ఆఫీసరు ఓ రోజు సుబ్బారావుతో ఖచ్చితంగా చెప్పేశాడు. "సుబ్బారావు .... నీ వూరికే ఆ కుర్చీలో రోజూ కూర్చొని, నెల కాగానే జీతం పట్టుకెళ్ళు. ఆ తైపుచేసి కాగితాలని ఎందుకు వృధాచేస్తావు. ఈ తప్పుల తడకల కాగితాలు దిద్దుకోడం అది నా కెందుకు, నీవేం చేయద్దు పని, ఏదో మీ నాన్న మొహంచూసి నిన్ని ఉద్యోగంలో ఉంచు తాను," అని అనేశాడు. సుబ్బారావు సిగ్గుతో చితికిపోయాడు

ఎలాగో ఒక ఏడాది వుద్యోగం చేశాడు సుబ్బారావు. కొడుక్కి వుద్యోగం కుదిర్చి సగం బాధ్యతే నెరవేర్చుకున్న తండ్రి, కొడుక్కి పెళ్ళి చేసి మిగతా సగం బాధ్యత కూడా తీర్చుకోడానికి ఓ సంబంధం కుదిర్చి, పెళ్ళి చేసి, ఆడపిల్లకి పెళ్ళి చేసి నిశ్చింతగా నిట్టూర్చినట్లు నిట్టూ ర్చాడు. అంతేకాక, ఆడపిల్లని అప్పగింతలు పెట్టినట్లు ఎన్నడూ లేని ప్రేమాభిమానాలు ఒలకబోస్తూ, కళ్ళ నీళ్ళు పెట్టుకుని "వదినగారూ ! మా వాడు కాస్త నోట్లో నాలుక లేనివాడు. మీ చేతిలో పెడుతున్నాను .... ఇంక వాడి భారం మీదే" అని వియ్యాపురాలికి, "అమ్మా ! వాడుత్త అమాయకుడు. ఎలా చూసుకుంటావో వాడిని జాగ్రత్త" అంటూ కోడ లికి అప్పగింతలు పెట్టి సుబ్బారావు అమాయకతని, అసమర్థతని చాటి చెప్పి, వాళ్ళ దృష్టిలో సుబ్బారావుని మరింత లోకువ చేసింది తల్లి.

ఇటు కన్న తల్లిదండ్రులతో, అటు ఆఫీసులో విసిగిపోయిన సుబ్బారావు నవ్యత నాశించి, ఇల్లరికపుటల్లుడిలా అడుగు పెట్టిన సుబ్బా రావు తన జీవితం యిదివరకటికంటె కనిష్టంగా తయారయిందని తెలుసు కోడానికి చాలా రోజులే పట్టింది.

ఇంక యీ జీవితంలో మంచి రోజులు చూడగలనేమోనని ఆశ పడడం అవివేకం అని తెలుసుకున్న సుబ్బారావుకి జీవితం మీద ఏవ గింపు కలిగింది.

"చచ్చిపోవాలి ! .... చావాలి !" మరోసారి గట్టిగా నిశ్చయించుకుని ఆ నిశ్చయం సడలిపోకుండా వెంటనే ఎరకల వాళ్ళింటికి సాయంత్రమే వెళ్ళి కావాల్సిన విషం తెచ్చుకుని జాగ్రత్త చేసుకున్నాడు సుబ్బారావు.

ఆ రాత్రి అంతా సుబ్బారావు తనేదో ఘనకార్యం చేయబోతున్నట్లు ఆనందంతో తేలిపోయాడు. తను చచ్చిపోతే అందరూ ఎలా ఏడుస్తారో ! కనకం ఏం చేస్తుందో ! అప్పుడందరి మొహాలు చూసి ఆనందించాలి ! చచ్చి తన సామర్థ్యం నిరూపించాలి !

× × ×

రోజూ ఉదయం ఐదు గంటలకే నిద్రలేచి పనుల్లో జొరబడే సుబ్బారావు ఆ రోజు ఆరయినా లేవకుండా ముసుగుతన్ని పడుకున్నాడు.

అత్తగారు పాలు తీయలేదని సణగడం, కేకలు వేసి విసుక్కోవడం అన్నీ విన్న సుబ్బారావు పులకలేదు. పలకలేదు. ఇంకో గంటలో చావబోయే తనని వీళ్ళు ఏం చేయగలరు ? వీళ్ళ కోపం నన్నేం చేస్తుంది ఇంక ! నవ్వుకుంటూ పడుకున్నాడు నిశ్చింతగా.

కనకం ఓ సారి వచ్చి లేపితే "నా వంట్లో బాగులేదు. ఇవాళ లేవలేను" అని చెప్పేశాడు ఖచ్చితంగా. నాలుగైదేళ్ళలో ఎన్నడూ లేని యీ వింత ఏమిటి అని ఆశ్చర్యపోయారు అందరూ. జవాబు చెప్పే ధైర్యం సుబ్బారావు కెక్కడనించి వచ్చిందని అందరూ ఆశ్చర్యంతో తెల్లబోయారు. "ఏం వేషం ? రాత్రి కంచడన్నం చెల్లించాడు, ఇంతలో ఏమి వచ్చింది ?" అని అత్తగారు అనడం విన్న సుబ్బారావు ఖాతరు చేయలేదు. మొండిగా అలా కాఫీ వాసన తగిలేదాకా పడుకుని తరువాత సావధానంగా లేచి దంతధావనం చేసుకుని కాఫీ కోసం కూర్చున్నాడు.

కనకం కాఫీ గ్లాసు తెచ్చి విసురుగా ప్రక్కనపెట్టి "కాఫీ సేవించండి, దానికేం అభ్యంతరం లేదుగా !" అంటూ ఓ విసురు విసిరి విస విసా వెళ్ళిపోతుంటే రోజూ కొరకొరా చూసే సుబ్బారావు ఆ రోజు

నవ్వుకున్నాడు. సావకాసంగా ఓ రెండు గుటకలు మింగి, తెచ్చిన విషం పొట్లం విప్పి కలుపుకున్నాడు కాఫీలో. త్రాగటానికి తీసిన గ్లాసు వణికింది చేతిలో! మనసు ధృఢపరచుకుని, ఒకసారి దేవుడిని తలుసుకున్నాడు. అయిపోయింది! ఇంక యీ అసమర్థుని జీవితయాత్ర ముగియబోతూంది .... ఇంక తనకి నిశ్చింత! ఎవరి అవహేళనలు, ఎవరి దయాధర్మాలు తన కక్కరలేదు. "రండ్రోయ్, నేను చచ్చి పోతున్నా" అని పెద్దగా అరవాలన్న కోరికను బలవంతంగా అణుచుకుని, కాఫీ త్రాగబోయేంతలో "నాన్నా, కాఫీ ఈయి" అంటూ సుబ్బారావు కొడుకు తయారయాడు.

డబ్బుతో కొడుక్కి ఏమీ కొని యిచ్చి ముచ్చట తీర్చుకోలేని సుబ్బారావు, తనకి చేతనయినంతలో, తన వంతుకు వచ్చే కాఫీ, పండో ఫలమో కొడుక్కి కొంత యిచ్చి తృప్తి పడేవాడు. రోజు కాస్త కాఫీ అడుగున మిగిల్చి కొడుక్కి యీయడం అలవాటయిన సుబ్బారావు యీ రోజు ఆ సంగతి మరచిపోయాడు. కొడుకు కాఫీ గ్లాసు అందుకోబోతూంటే గాభరా పడుతూ "వద్దు బాబూ కాఫీ యివాళ బాగులేదు. వెళ్ళి పాలు త్రాగు" అంటూ నచ్చచెప్పబోయాడు. అలవాటయిన కొడుకు ఎంత నచ్చ చెప్పినా వినక మారాం పెడుతూంటే ఏం చెయ్యాలో తోచక రెండు అంటించాడు. ఎంతయినా కన్న కొడుక్కి విషం చేతులారా యీయగలడా? తండ్రి కోపమే ఎన్నడు ఎరగని వాడు, తండ్రి దెబ్బలకి భయపడి, ఆరునొక్క రాగం ఆలాపించాడు.

కొడుకు ఏడుపుకి కనకం పరిగెత్తుకు వచ్చింది. మనవడి ఏడుపుకి తాత, అమ్మమ్మ పరిగెత్తుకు వచ్చారు ఎన్నడు ఎరగని వింతలా ఆశ్చర్యపోయారు సంగతి విని. ఈరోజు సుబ్బారావుకి ఏం జరిగిందో అంతుబట్టక ఆశ్చర్యపోయారు. "వాడిక్కి కాఫీ అలవాటుచేసి యివాళ ఈయకుండా వాడిని ఎందుకు ఏడిస్తున్నారు. కొట్టడం కూడానా వాడిని" అంటూ ఉరిమింది కనకం "బాగానే వుంది ప్రయోజకత్వం. నోరెరగని పసివాడి మీదలావుంది ప్రయోజకత్వం చూపించడం" మామగారు కాస్త గట్టిగానే దులిపాడు.

సందు చూసుకుని కొడుకు కాఫీగ్లాసు అందుకుంటూంటే, గాభరా పడిపోయి, ఏం చేయాలో తోచక, గభాలున గ్లాసు లాక్కుని చేయి జారినట్లు వదిలేశాడు. గండం గడిచినట్లు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. కష్టపడి సంపాదించిన విషం అంతా నేలపాలయింది.

తన ప్రయత్నం విఫల మవడంతో ఆ కోపం ఎవరిమీద చూప లేక, విసవిసా యింట్లోంచి వెళ్ళిపోతున్న సుబ్బారావుకి పిచ్చి పట్టిం దన్నట్టు; ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు ముగ్గురూ !

"ఛ....తన ప్లానంతా భగ్నం ఐపోయింది. ఎన్నాళ్ళ నుంచో అనుకుని ఆఖరికి తెగించిన తన యత్నం విఫలమైంది. తన నిశ్చ యానికి తిరుగుండకూడదు....ఏమైనా సరే యీ రోజున యీ జీవితం అంతం చేసుకోవల్సిందే !...." యిది కాకపోతే .... యింకో రకంగా నైనాసరే తను చావాల్సిందే!...." సుబ్బారావ్ పట్టుదల పెరిగింది.

ఊరవతల చెరువులోపడి చావాలని నిశ్చయించుకున్నాడు సుబ్బా రావు. అక్కడయితే, సాధారణంగా మనుషులుండరు .... అదే అను కూలమయిన చోటని నిశ్చయించుకుని వడివడిగా అక్కడ చేరిన సుబ్బారావుకి. అక్కడా నిరాశే ఎదురయింది. ఆ రోజు చాకలివాళ్ళు రేవు పెట్టుకుని కూర్చున్నారు. వాళ్ళే రోజంతా అక్కడ నుంచి కదిలే సూచనలు లేకపోవడంతో ఉస్సురని తిరుగు మొహం పట్టాడు సుబ్బారావు. వాళ్ళందరూ వుండగా, చెరువులో దుమికితె ఎలాగో పైకిలాగక మానరు. చావుదప్పి కన్ను లొట్టవుతుందేమోనని భయపడి ఆ ప్రయత్నం విర మించుకున్నాడు సుబ్బారావు.

ఇంకేం చేయాలి ? చావడం కూడా ఇంత కష్టమా ! విసుక్కు న్నాడు సుబ్బారావు....ఉరేసుకుంటే ? ఎక్కడ ? ఆలోచిండాడు అను వైన చోటుకోసం .... యింట్లో లాభంలేదు .... ఏ రోడ్డు మీదో, ఏ చెట్టుకో వ్రేలాడితే నలుగురూ చూసి - చివాట్లు పెట్టి ఆ యత్నం కూడా విఫలం చేయవచ్చు. మామగారి మామిడితోట నిర్మానుష్యంగా వుంటుంది .... అక్కడ అయితే నిరాటంకంగా పని అవుతుందని నిశ్చయించుకుని

పొలాలకి అడ్డంపడి, మోటబావికి కట్టిన మోకుతాడు విప్పుకుని, జోరుగా నడక సాగించాడు.

నిర్మానుష్యంగా వుంటుందను కున్న తోట కూడా సుబ్బారావు దురదృష్టం కొద్దీ, అదృష్టం కొద్దీగాని ఆ రోజు అక్కడ కూలీలు పని చేయడం చూసి నీళ్ళుగారి పోయాడు. "బాబుగారు ఈయాల మామిడిచెట్లన్నిటికి గొప్పులు తవ్వమన్నారన్న" కూలీల జవాబు విని హతాశుడై పోయాడు. ఏమిటిది ? ఎక్కడికి వెళ్ళినా చుక్కెదురవుతూంది ! చావడానికి కూడ యిన్ని ఆటంకాలా ? చావడంకూడ చేతకాని అసమర్ధుడా తను ! ఏం చేయాలో పాలుపోక అలా ఒక చెట్టు మొదట వ్రాలిపోయాడు సుబ్బారావు.

"ఇంకేం చేయడం ? తల పెట్టిన అన్ని ప్రయత్నాలు విఘ్నమై పోతున్నాయి ! ఎలా చావడం ? ఎంత ఆలోచించినా తెగని సమస్య అయింది ఆఖరికి సుబ్బారావుకి. ఇంక ఇంటి ముఖం చూడడం కల్ల ! ఇవాళతో తనకూ ఆ యింటికి ఆ యింటి కేమిటి, ప్రపంచానికోసే ఋణం చెల్లిపోవాలి ! చచ్చినా యింటికి వెళ్ళకూడదు. ఎలాగైనా చచ్చి తీరాలి....ఇంక ఒక్కటే మార్గం మిగిలింది రైలుక్రింద బుర్ర పెట్టడం ! సాయంత్రం ఐదుగంటలకి గాని అటునుంచి మెయిలురాదు. అప్పటివరకు తను బ్రతుకక తప్పదు !

పన్నెండు గంటలయి, ఎండ మాడిపోతూంటే, ఉదయం నించి కాఫీనీళ్ళయినా త్రాగని సుబ్బారావుకు నీరసంగావచ్చి కళ్ళు తిరిగినట్లయింది ఏమయినా సరే యింటికి వెళ్ళకూడదన్న పంతం కొద్దీ నూతిలో నీళ్ళతో మొహం కడుక్కుని, కడుపు పట్టినన్ని నీళ్ళు త్రాగి ఓ చెట్టుక్రింద ఆదమరిచి నిద్రపోయాడు సుబ్బారావు. శాశ్వత నిద్రపోయే ముందు ప్రశాంతిగా, హాయిగా నిద్రపోయాడు.

హఠాత్తుగా నిద్రనించి మెలకువ వచ్చిన సుబ్బారావు ప్రొద్దు బాగా వాలిపోవడంతో గాభరాగా రైలుకట్ట వైపు నడిచాడు.

రైలు లైను చేరి పట్టాలమీద తల పెట్టి పడుకోగానే ఉదయం

నించి తిండి లేకపోవడం, ఉదయం నించి తిరిగిన తిరుగుడు అంతా కలిసి నిస్త్రాణ వచ్చి, చిన్న మగత కమ్మింది సుబ్బారావుకి. ఎవరో తనని లేవదీసి, మొహం మీద నీళ్ళు చిలకరించడం తెలిసి, తెలివి వచ్చింది సుబ్బారావుకి. ఆ ఊరి కరణం, ఆయన బావమరిది ఊరు చివరికి షికారుగా వచ్చి సుబ్బారావు రైలు లైనుమీద తెలివి తప్పినట్టు పడుండడం చూసి ప్రక్కకి తీశారట. కరణం చివాట్లు పెట్టాడు సుబ్బారావుని. మేం రావడం ఇంకో పది నిమిషాలు గనక ఆలస్యం అయితే, బలవంతంగా చచ్చిపోయి వుండేవాడి వన్నారు. సుబ్బారావుకి ఏడవాలో నవ్వాలో తెలియలేదు. చివరి ప్రయత్నం విఫలం అవడంతో కోపం ముంచుకొచ్చింది తనని రక్షించిన వాళ్ళమీద. వీళ్ళే లేకపోతే హాయిగా ఈ పాటికి చచ్చిపోయుండే వాడు గదా! ఆ కరణంగారు సుబ్బారావు తెలివి తప్పి పడిపోయాడను కొని సుబ్బారావు పరిస్థితికి సానుభూతి చూపుతూ, సుబ్బారావు మామని తిట్టసాగాడు. "గొడ్డులా చాకిరి చేయించుకుని సరిగా తిండి అయిన పెట్టడని" దుమ్మెత్తి పోశాడు. అన్నీ వింటూ వీళ్ళెప్పటికి పోతారా అని సుబ్బారావు ఓపికగా కనిపెట్టుకుని కూర్చున్నాడు! ఇంకో గంటలో ప్యాసింజరు వచ్చే వేళకైనా వీళ్ళు పోతారో పోరో. యీసారైనా తన కోరిక తీరుతుందో లేదో అని కనిపెట్టుకుని కూర్చున్నాడు.

ఆ ప్యాసింజరు బండి వచ్చి వెళ్ళే దాకా వాళ్ళు అలాగే కూర్చుని సుబ్బారావు మామని ఆడి పోసుకుని తరువాత సావకాశంగా లేచి, తర్వాత వస్తానన్న సుబ్బారావుని వినకుండా ఇంటి దగ్గిర దింపుతాం! మళ్ళీ మొహం తిరిగి పడి పోతావు. అంటూ చెరో రెక్క పట్టుకు లేవదీసి బలవంతంగా నడిపించుకుంటూ బయలుదేరారు. గత్యంతరం లేక మనసులో తిట్టుకుంటూ బయలు దేరాడు సుబ్బారావు.

నందు మొగని విడిచి వాళ్ళు వెళ్ళాక గిరుక్కున తిరిగి మళ్ళీ వెనక్కి బయలు దేరాడు! ఏదో ఒకటి చేసి తను చావాలి! పట్టు విడవ

కుండా మళ్ళీ బయలుదేరాడు సుబ్బారావు .... విషం కోసం మళ్ళీ ఎర కల వాళ్ళింటికి వెడితే "ఇంక లేదు బాబూ, అయిపోయింది. రెండ్రోజు లాగివస్తే యిస్తా" మన్నారు ! "మీ విషం కోసం నే రెండు రోజులు కాదు కదా, రెండు గంటలు కూడా ఆగ" నను కున్నాడు గట్టిగా సుబ్బా రావు.

చీకటి పడింది. చెరువు దగ్గిర ఎవరూ వుండరు ! చావడానికి యిదే మంచి సమయం ! ఇంక జాప్యం చేయకూడదని నిశ్చయించుకుని పొలం గట్లమీద చీకటిలో, వడివడిగా నడక సాగించాడు సుబ్బారావు.

హఠాత్తుగా, నడుస్తున్న సుబ్బారావు కాలికి ఏదో మెత్తగా తగిలి చుట్టుకోడం, కాలిమీద కాట్లు పడడం అన్నీ ఒక్క క్షణంలో జరిగి పోయాయి. సుబ్బారావు ఏం జరిగిందో తెలుసుకునే లోపలే, గుడ్డివెన్నెల్లో జరజర ప్రాకే బారెడు పొడుగు నల్లత్రాచును చూసి భయంతో వణికి పోతూ, కూలబడి పోయాడు సుబ్బారావు.

మృత్యువు నాహ్వానిస్తూ రకరకాల యత్నాలు అప్పటి వరకు చేసిన సుబ్బారావు .... ఇప్పుడు మృత్యు భయంతో, ప్రాణాలమీద తీపితో సహాయంకోసం గావు కేకలు పెట్టసాగాడు. ఆ నిర్మానుష్యమైన సంజె చీకటి వేళ.

నోట్లోంచి నురగలు కక్కుతూ, వంటిమీద తెలివితప్పి పోతూం డగా చప్పున ఒక సంగతి గుర్తుకు వచ్చింది సుబ్బారావుకి...."మృత్యువు కూడా తన అసమర్థతని చాటి చెప్పిందని !"